# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం 16 జూలై 2025 పేజీలు 8





-2లో

# ఐకార్ బయాలాజిక్స్... కొత్త యూనిట్‌కి భూమిపూజ

## బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ మారుతుందన్న రేవంత్..

- మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్..
- నూతన పారిశ్రామిక వేత్తలను ఈ ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్న సీఎం..
- జీనోమ్ వ్యాలీ కొత్త యూనిట్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి..
- కరోనా సమయంలో ప్రపంచ దేశాలకు జీనోమ్ వ్యాలీ వ్యాక్సిన్ పంపిణీ..



భూమి పూజలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు..

# మలక్‌పేటలో కాల్పుల కలకలం సీపీఐ నేత స్పాట్‌డెడ్

- షిఫ్ట్ కారులో వచ్చి చందు నాయక్ కండ్లల్లో కారం చల్లిన దుండగులు
- గన్ తో 6 రౌండ్లు కాల్చి పరార్
- భూ తగాదాలే కారణం!



హైదరాబాద్ పెన్ పవర్: మలక్‌పేటలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. శాలివాహన నగర్ పార్క్‌లో ఉదయపు నడకకు వెళ్లిన సీపీఐ రాష్ట్ర నాయకుడు చందు నాయక్(43)పై గుర్తు తెలియని దండుగులు కాల్పులు జరిపారు. కారులో వచ్చిన దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో చందునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. చందు నాయక్.. తన భర్య, కుమార్తెతో కలిసి ఉదయపు నడకకు వచ్చిన సమయంలో అందరూ చూస్తుండగానే కాల్పుల ఘటన చోటు చేసుకుంది.

-3 లో

# నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు అరెస్ట్



హైదరాబాద్ పెన్ పవర్: నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) మురళీధర్‌రావు అరెస్టయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. మురళీధర్‌రావుతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 11 చోట్ల తనిఖీలు జరిగాయి. వివిధ పత్రాలను ఏసీబీ అధికారులు పరిశీలించి భారీగా ఆస్తులను గుర్తించారు. హైదరాబాద్ శివారులో 11 ఎకరాల భూమి, నాలుగు ఇళ్ల స్థలాలు, మోకిలలో 6,500గజాల స్థలం గుర్తించారు. కొండాపూర్‌లో విల్లా.. బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, బేగంపేట, కోకాపేట ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ ప్లాట్లు ఉన్నట్లు తేలింది. కరీంనగర్, హైదరాబాద్‌లో వాణిజ్య సముదాయాలు, జహీరాబాద్‌లో సోలార్ పవర్ ప్రాజెక్ట్, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లను గుర్తించారు. మురళీధర్‌రావు ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీవిరమణ పొందారు. తర్వాత ఆయన పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు పదవిలో ఉన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్‌రావును ప్రభుత్వం తొలగించింది.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ..



భూమి పూజలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు వివేక్, శ్రీదర్‌బాబు..

# ఐకార్ బయాలాజిక్స్...
# కొత్త యూనిట్‌కి భూమిపూజ

## బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ మారుతుందన్న రేవంత్..

- మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్..
- నూతన పారిశ్రామిక వేత్తలను ఈ ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్న సీఎం..
- జీనోమ్ వ్యాలీ కొత్త యూనిట్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి..
- కరోనా సమయంలో ప్రపంచ దేశాలకు జీనోమ్ వ్యాలీ వ్యాక్సిన్ పంపిణీ..



కొత్త యూనిట్ ప్రారంభం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 15:** జీనోమ్ వ్యాలీలోని బయోటెక్నాలజీ సంస్థ, ప్రాణాలను, రక్షించే ప్లాస్మా- ఉత్పన్న చికిత్సలను తయారు చేయడానికి, అభివృద్ధి పరచడానికి ఐకార్ పునాది వేసిందని తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు.. మంగళవారం శామీర్పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు.. సీఎం చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు.. ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ మారుతుందని అన్నారు.. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్, బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామిక వేత్తలదే నని సీఎం కొనియాడారు..! ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయన్నారు..

## నూతన పారిశ్రామిక వేత్తలకి ఆహ్వానం..

కాంగ్రెస్ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని, నూతన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుందని, వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తుందన్నారు..
రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుంది.. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3 లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.. రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.. కార్యక్రమానికి ముందుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డిలు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.



సీఎం రేవంత్‌రెడ్డికి అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, పుష్ప గుచ్ఛంతో ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసున్న కలెక్టర్ మను చౌదరి..









## సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి ఆదేశాలు..

కలెక్టర్ మను చౌదరితో విధ్యార్థులు వాటర్ ట్యాంక్ మరమ్మతుల కారణంగా, నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, డోర్స్, ఫ్యాన్స్, భోజనం వంటి సమస్యలతో ఇబ్బందులు వస్తున్నాయని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.. కలెక్టర్ వెంటనే స్పందించి నీటి ట్యాంకును వెంటనే మరమ్మతులు చేపట్టాలని, భోజనం, టిఫిన్స్, తయారుచేసే సామాగ్రీని కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, డోర్లు, ఫ్యాన్లు తక్షణమే రిపేర్లు చేయించి వాడకంలో తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు.. విద్యార్థులకు కష్టంగా ఉన్న సబ్జెక్టుల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలని తెలిపారు, అలాగే క్రీడలు కూడా నిర్వహించాలని ఆయన సూచించారు. వంటగదిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు శుభ్రంగా పెట్టాలని దోమలు, ఈగలు రాకుండా శానిటేషన్ సమస్య తలెత్తకుండా ఉండాలని బియ్యం, కూరగాయలను బాగా కడగాలని.. వంటతీరు పరిశుభ్రంగా ఉండాలన్నారు.. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యాదగిరి రెడ్డి, హెడ్ మాస్టర్ , తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీని..

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

### శామీర్‌పేట్ మండలం తుర్కపల్లి జ్యోతి రావు పూలే బీసీ బాలుర రెసిడెన్షియల్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 15:** విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి అన్నారు..మంగళవారం శామీర్‌పేట్ మండలం తుర్కపల్లి లోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి వెల్పేర్ రెసిడెన్సీయల్ బాలుర పాఠశాల, జూనియర్ కాలేజీలని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.. ప్రభుత్వ బీసీ బాలుర రెసిడెన్షియల్ నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు..ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ కాసేపు మాట్లాడారు.. యూనిఫామ్స్, నోట్ బుక్స్ అందరికీ వచ్చాయా, భోజనం బాగుంటుందా, చదువు ఎలా ఉందని విద్యార్థులతో ముచ్చటించారు, సబ్జెక్టులన్నీ అర్థమవుతున్నాయా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. ఎవరెవరికి ఏ సబ్జెక్టులు కష్టంగా ఉన్నాయి, అదేవిధంగా, ఎమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు..



# మలక్‌పేటలో కాల్పుల కలకలం సీపీఐ నేత స్పాట్‌డెడ్

- మొదటి పేజి తరువాయి

దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మృతుడి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం నర్సాయిపల్లి. భూ తగాదాల కారణంగానే హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకొని ఆధారాలు సేకరించింది. కొన్నేళ్ల క్రితం చందు నాయక్ సీపీఐ ఎంఎల్ నుంచి సీపీఐలో చేరారు. 2022లో ఎల్బీనగర్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నారు. మరో వైపు కాల్పులు జరిపిన రాజేశ్, సుధాకర్ మరో ఇద్దరు నిందితులు ఎస్‌వోటీ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు సమాచారం.

**10 ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు: సౌత్ ఈస్ట్ డీసీపీ చైతన్యకుమార్**

"ఉదయం 7.30 గంటలకు ఓ వ్యక్తిపై కాల్పులు జరిగాయని సమాచారం వచ్చింది. చందునాయక్ మార్నింగ్ వాక్ చేస్తుండగా స్విఫ్ట్ కారులో వచ్చిన నలుగురు దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నాం. నిందితుల కోసం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నాం. స్పాట్‌లో 5 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నాం. క్లూస్ టీమ్ ద్వారా అన్ని ఆధారాలు సేకరించాం. ఘటనా స్థలిలో దొరికిన బుల్లెట్లను పరిశీలిస్తే.. వెపన్‌తో ఫైరింగ్ చేసినట్టుగా ఉంది. స్పాట్‌లో ఉన్న సీసీ కెమెరాతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న అని కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నాం. పాతకక్షలు ఏమైనా ఉన్నాయా?అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. నిందితులు ఉపయోగించిన కారును గుర్తించాం. త్వరలోనే వారిని అరెస్టు చేస్తాం" అని డీసీపీ చైతన్య కుమార్ తెలిపారు.

# ఇద్దరి ప్రాణం తీసిన భార్యాభర్తల గొడవ!



**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి గ్రామంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం ఇద్దరి నిండు ప్రాణాలను బలిగొంది. పెద్దమనుషులు నిర్వహించిన పంచాయితీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని కత్తుల దాడికి దారితీసింది.

సుగ్లాంపల్లి గ్రామానికి చెందిన ఓ భార్యాభర్తల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు గ్రామంలో పెద్దమనుషులు, బంధువుల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశారు. అయితే, పంచాయితీ జరుగుతుండగానే పరిస్థితి అదుపు తప్పింది. భర్త తరపు బంధువులు ఆవేశంతో భార్య తరపు బంధువులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాండ్ల గణేశ్, మోటం మల్లేశ్ అనే ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో సుగ్లాంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ పెద్దదై, చివరికి ఇద్దరి ప్రాణాలను బలితీసుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రాజాసింగ్ నా గురించి హేళనగా మాట్లాడారు: మాధవీలత



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల బీజేపీకి గుడ్ బై చెప్పిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పై ఆ పార్టీ నాయకురాలు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాధవీలత విమర్శలు గుప్పించారు. బీజేపీ మద్దతు లేకుండానే రాజాసింగ్ ఎమ్మెల్యేగా గొలుపొందారా? అని ప్రశ్నించారు. కార్పొరేటర్ గా ఉన్న రాజాసింగ్ ను ఎమ్మెల్యే చేసింది బీజేపీనే అని చెప్పారు. బీజేపీ గురించి ఏది పడితే అది మాట్లాడటం సరికాదని అన్నారు. ఇతర మతాల వారిని, మహిళలను దూషించడమే హిందుత్వమా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు రాజాసింగ్ సహకరించలేదని మాధవీలత విమర్శించారు. ఎంపీ అభ్యర్థిగా మగాళ్లే దొరకలేదా? అంటూ తన గురించి హేళనగా మాట్లాడారని మండిపడ్డారు. గోషామహల్ లో రాజాసింగ్ కంటే తనకే ఎక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు. మాధవీలత బలహీనురాలు కాదని చెప్పారు. గోషామహల్ స్థానాన్ని తనతో భర్తీ చేయాలని హైకమాండ్ భావిస్తుండటం తన అదృష్టమని అన్నారు. గోషామహల్, జూబ్లీహిల్స్ ఎక్కడ పోటీ చేయమన్నా బరిలోకి దిగేందుకు తాను సిద్ధమని చెప్పారు.

# నోట్స్ ఇస్తామని ఇంటికి పిలిచి.. స్టూడెంట్‌పై ఫిజిక్స్, బయాలజీ లెక్చరర్ల అఘాయిత్యం.. వాళ్ల ఫ్రెండ్ కూడా..



**హైదరాబాద్ పెన్ పవర్:**గురువు అంటే విద్యాబుద్ధులు చెప్పి.. విద్యార్థిని సక్రమ మార్గంలో నడిపించేవాడు. తల్లిదండ్రుల తర్వాత అంతటి అంతకు మించిన బాధ్యతు స్టూడెంట్ ను విజయపథాలవైపు నడపాల్సిన వాడు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే గురువులు.. ఆ పదానికి ఉన్న అర్థానికే మకిలి అంటించేలా ప్రవర్తించారు. తండ్రి సమానులుగా భావించి నోట్స్ ఇస్తామంటే నమ్మి వెళ్లిన స్టూడెంట్ పై అఘాయిత్యానికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా వాళ్ల ఫ్రెండ్ తో కూడా దారుణం చేయించేలా ప్రవర్తించారు. ఈ దారుణ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది.

బెంగళూరులో జరిగింది ఈ అమానవీయ ఘటన. స్టూడెంట్ ను రేప్ చేసిన ఇద్దరు లెక్చరర్లతో పాటు మరో వ్యక్తిని ఈ కేసులో అరెస్టు చేశారు పోలీసులు. బాధితురాలు కర్ణాటక మహిళా కమిషన్ లో ఫిర్యాదు చేసిన తర్వాత నిందితులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఫిజిక్స్ లెక్చరర్ అయిన నరేంద్ర, బయాలజీ లెక్చరర్ అయిన సందీప్ తో పాటు వాళ్ల ఫ్రెండ్ ను కూడా అరెస్టు చేశారు.

పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఫజిక్స్ లెక్చరర్ అయిన నరేంద్ర.. నోట్స్ ఇస్తానని తన స్టూడెంట్ ను ఫ్రెండ్ ఇంటికి రావాల్సిందిగా పిలిచాడు. ఆ తర్వాత స్టూడెంట్ పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బయాలజీ లెక్చరర్.. కూడా స్టూడెంట్ పై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఫిజిక్స్ లెక్చరర్ రేప్ చేస్తున్న వీడియో తన వద్ద ఉందని.. తనకు సహకరించకపోతే బయటపెడతానని బెదిరించి అత్యాచారానికి దిగాడు. ఈ లెక్చరర్లకు స్నేహితుడైన అనూప్ అనే వ్యక్తి.. సీసీటీవీ ఫూటేజ్ బయటపెడతానని బెదిరించి.. వీడు కూడా అమ్మాయిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు.

ఈ దారుణ ఘటన నెల రోజుల క్రితం జరిగింది. అయితే దుర్మార్గుల చేతిలో నలిగిపోయిన స్టూడెంట్ తన తల్లిదండ్రులతో జరిగిందంతా చెప్పడంతో ఈ దారుణం బయటపడింది. లెక్చరర్ల రూపంలో ఉన్న కామ పిశాచులకు తగిన శిక్ష పడాలని.. లేదంటే మరెందరి జీవితాలు నాశనం చేస్తారోనని.. మహిళా కమిషన్ లో ఫిర్యాదు చేశారు. కమిషన్ ఆదేశాల మేరకు మరతహల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసు జులై 5న రిజిస్టర్ అయ్యిందని జాయింట్ కమిషనర్ రమేశ్ బానోత్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మహిళా కమిషన్ ఆదేశాల ప్రకారం.. ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు ఈ కేసులో దర్యాప్తు జరుగుతోందని తెలిపారు.

# గుండు కొట్టించి రాత్రుళ్లు నరకం చూపించాడు.. ఏడాదిన్నర కూతురిని చంపి చచ్చిపోయింది.. ఇలాంటి శాడిస్ట్ భర్తలు కూడా ఉన్నారు !



**హైదరాబాద్ పెన్ పవర్:**యూఏఈలోని షార్జాలో హృదయవిదారక ఘటన జరిగింది. ఒక వివాహిత ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. ఏడాదిన్నర వయసున్న కన్నబిడ్డను చంపి ఆ తర్వాత ఆమె తన ప్రాణాలు తీసుకుంది. వరకట్న వేధింపులు, భర్త, అత్తింటి వాళ్లు పెట్టిన చిత్రహింసలు భరించలేక తమ కూతురు ఇలా కన్న కూతురిని చంపి.. తాను ప్రాణాలు తీసుకుని అర్థాంతరంగా తనువు చాలించిందని ఆమె తల్లి కన్నీరుమున్నీరయింది. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే కొన్ని దారుణమైన విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఫెయిర్?గా ఉండటమే ఆ వివాహిత చేసిన పాపమైంది. తండ్రిలా చూసుకోవాల్సిన మామ తనను లైంగికంగా వేధించాడు. అడ్డుకోవాల్సిన ఆమె భర్త ఈ పైశాచిక కృత్యానికి సాక్షిగా నిలిచాడు. ఈ పరిణామాలతో ఆమె తన జీవితంపై విరక్తి చెందింది. తన ఏడాదిన్నర వయసున్న కూతురిని సక్రమంగా చూసుకోరనే భయం ఆమెను వెంటాడింది. కన్నబిడ్డను చంపి ఆ తర్వాత ఆమె కూడా బలవన్మరణానికి పాల్పడింది. భర్త, అత్తింటి వాళ్లు నల్లగా ఉండటంతో ఆ వివాహితకు బలవంతంగా గుండు కొట్టించి అంద విహీనంగా మార్చి.. తిండీతిప్పలు లేకుండా కడుపు మాడ్చారని సదరు వివాహిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. కేరళలోని కొల్లాంకు చెందిన విపంజిక మణి అనే 32 ఏళ్ల యువతికి నిదీష్ అనే యువకుడితో వివాహం అయింది. కేరళకు చెందిన విపంజిక, నిదీష్ యూఏఈలోని షార్జాలో ఒక ఫ్లాట్?లో ఉంటున్నారు. నిదీష్ కుటుంబం కూడా వీళ్లతోనే కలిసి ఉంటోంది. జులై 8న విపంజిక, ఏడాదిన్నర వయసున్న ఆమె కూతురు వైభవి తమ ఫ్లాట్?లో విగత జీవులుగా పడి ఉన్నారు.

అత్తింటి వేధింపులు, వరకట్న వేధింపులు ఈ ఇద్దరి ప్రాణాలు పోవడానికి ప్రధాన కారణంగా పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. విపంజిక భర్త నిదీష్?ను ఏ1 నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేశారు. నిదీష్ తండ్రి, నిదీష్ సోదరిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విపంజికను మానసికంగా, శారీరకంగా హింసించి ఆమె ఆత్మహత్యకు కారణమయ్యారని విపంజిక తల్లి తన ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు.. నిదీష్?తో పాటు అతని కుటుంబ సభ్యులు నల్లగా ఉంటారు.

విపంజిక ఫెయిర్ స్కిన్. ఆమె రంగు కూడా నిదీష్?కు, అతని కుటుంబానికి నచ్చలేదు. ఆమెను అంద విహీనంగా చేయడానికి గుండు కొట్టించారు. చిత్రహింసలకు గురిచేశారు. నిదీష్

వివాహేతర సంబంధాల గురించి విపంజిక నిలదీయడంతో ఆమెకు విడాకుల నోటీసులు పంపి ఇంట్లోంచి గెంటేస్తామని బెదిరించారు. తాను అనుభవించిన మానసిక వేదనను, శారీరక యాతనను విపంజిక తన ఫేస్ బుక్ పోస్ట్?తో పాటు తన స్వహస్తాలతో రాసిన నోట్?లో పూసగుచ్చినట్టు వివరించింది.

పెళ్లైన కొన్నాళ్లకే తన భర్త శాడిస్ట్?లా ప్రవర్తించాడని.. నీలి చిత్రాలు చూస్తూ అందులో ఉన్నట్టు చేయాలని రాత్రుళ్లు నరకం చూపించాడని విపంజిక భర్త శాడిజం గురించి తన నోట్?లో బయటపెట్టింది. గర్భిణి అనే కనీస కనికరం లేకుండా తనకు ఫుడ్ కూడా పెట్టకుండా నరకం చూపించారని, తన భర్తతో పాటు మామను, తన భర్త సోదరిని కఠినంగా శిక్షించాలని తన నోట్?లో విపంజిక డిమాండ్ చేసింది.

# రూ 4వేల కోట్ల మెగా బడ్జెట్‌తో ‘ రామాయణం’.. చరిత్ర సృష్టించనున్న నితీష్ తివారీ!

**హైదరాబాద్ పెన్ పవర్:**బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం ‘రామాయణం’ ఈ మూవీ తొలి ప్రోమో విడుదలతోనే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఇప్పుడు దీని బడ్జెట్ వివరాలు సినీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో ఓ సరికొత్త మైలురాయిని సృష్టించబోతోందని సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

**ఊహించని బడ్జెట్!**


రామాయణం చిత్ర నిర్మాణంపై ఇటీవల నిర్మాత నమిత్ మల్హోత్రా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ మూవీని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు. అంతే కాదు ఈ రెండు భాగాలకు కలిపి బడ్జెట్ రూ . 4 వేల కోట్లకు పైగా ఉంటుందని ప్రకటించారు. ఇండియన్ మూవీ చరిత్రలో ఏ చిత్రానికి ఈ స్థాయిలో బడ్జెట్ కేటాయించింది లేదు. ‘రామాయణం’ బడ్జెట్ కు ఏ సినిమా కూడా దరిదాపుల్లో కూడా లేదని ఆయన తెలిపారు. నమిత్ ప్రకటన ఇప్పుడు భారతీయ సినీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.




**రెండు భాగాలుగా ‘రామాయణం’**

‘రామాయణం’ మూవీ కేవలం భారతీయ ప్రేక్షకులను కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులను ఆకట్టుకునే రూపొందిస్తున్నట్లు నమిత్ తెలిపారు. ఒక గొప్ప ఇతిహాసంతో కూడిన ఈ చిత్రంలో ఎక్కడా పొరపాటుకు తావు లేకుండా .. ప్రతి చిన్న అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. నిర్మాణ వ్యయంతో పాటు సినిమా నాణ్యతపై రాజీపడేది లేదు. దర్శకుడు నితీష్ తివారీ ఈ ప్రాజెక్టును చేపట్టడానికి ముందు విస్తృతమైన పరిశోధన చేశారని వెల్లడించారు. ‘రామాయణం’ రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మొదటి భాగం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని సమాచారం. అత్యున్నతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో పాటు, యాక్షన్ సన్నివేశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మరో వైపు హాలీవుడ్ స్టూడియోతో ప్రపంచవ్యాప్త పంపిణీకి కూడా నిర్మాతలు చర్చలు జరుపుతున్నారని సమాచారం. భారీ తారాగణంతో ‘ రామాయణం’ రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటుంది . ఈ మూవీలో రాముడిగా రణ్ బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి , లక్ష్మణుడుగా రవి దూబే , హనుమాన్ గా సన్నీడియోల్( నటిస్తున్నారు. ఇతర తారాగణంలో అరుణ్ గోవిల్, లారా దత్తా, రకుల్ ప్రీత్ సింగ్, కాజల్ అగర్వాల్, ఇందిరా కృష్ణన్, షీబా చద్దా, మోహిత్ రైనా, కునాల్ కపూర్, వివేక్ ఒబెరాయ్, శోభన, అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖులు నటిస్తున్నట్లు సమాచారం. ఆస్కార్ విజేతలు ఏఆర్ రెహమాన్ ,హాన్స్ జిమ్మర్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ‘రామాయణం’ మొదటి భాగం 2026 దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఇక రెండో భాగం 2027 దీపావళికి థియేటర్లలోకి రానుంది. పండుగ సీజన్‌లో విడుదల కావడం వల్ల సినిమా వసూళ్లకు కూడా సానుకూలంగా ఉంటుందని మూవీ మేకర్స్ అంచనా వేస్తున్నారు.

# ఏడాదికి రూ.60 లక్షలు సంపాదన.. భార్యాభర్తలే కానీ ఖర్చులన్నీ చెరి సగం అంట..!



**హైదరాబాద్ పెన్ పవర్:**గతంలో మాదిరిగా ఇంట్లోని మగవారు సంపాదిస్తుంటే కుటుంబ పోషనను మహిళలు చూసుకుంటూ ఉండేవారు. ప్రస్తుత కాలంలో భార్య భర్త ఇద్దరూ సంపాదిస్తున్నారు. ఎవరి ఉద్యోగాల్లో వారు బిజీగా గడుపుతున్న కాలం ఇది. పెరుగుతున్న ఖర్చులు, అవసరాలు, మారుతున్న జీవనశైలి ఇలా అనేక కారణాలు భార్యాభర్తలిద్దరూ కష్టపడాల్సిన పరిస్థితులను తీసుకొచ్చాయి. అయితే ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్న కుటుంబాల్లో వారి ప్రవర్తనకు సంబంధించిన విషయాలు చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.

ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త ఆయుష్మాన్ కపూర్ తన లింక్డిన్ ఖాతాలో ఇలాంటి ఒక ఆసక్తికరమైన సమాచారాన్ని పంచుకున్నారు. గురుగ్రామ్ ప్రాంతంలో తనకు తెలిసిన ఒక భార్యా భర్తలు ఏడాదికి చిరో రూ.30 లక్షలు వేతనంగా అందుకుంటున్నారని కపూర్ చెప్పారు. ఇంత సంపాదిస్తున్నప్పటికీ వారు ఫ్లాట్ మేట్స్ మాదిరిగా ఉన్నట్లు చెప్పారు. పెళ్లి చేసుకున్న జంట లాగా కాకుండా వారు ఖర్చు చేస్తున్న బిల్లులను చిరో సగం విభజించుకుంటూ రికార్డ్స్ కలిగి ఉన్నట్లు చెప్పారు. ఇంటి అద్దె, కిరాణా సరుకులు, కూరగాయలు, పాల బిల్లు, పెట్రోల్ ఖర్చుల నుంచి ఆఖరికి స్విగ్గీ జొమాటో ఆర్డర్ల బిల్లులను కూడా భార్యా భర్తలు సమానంగా చెల్లిస్తున్నట్లు కపూర్ చెప్పారు. వారి ప్రవర్తన తనను అయోమయానికి గురిచేసిందని, తనకు ఇబ్బంది కలిగించిందని అనుభవాన్ని పంచుకున్నారు. అసలు ఎక్కడైనా భార్యా భర్తలు ఇలా ఉంటారా.. ఎంత సంపాదిస్తే మాత్రం ఖర్చు చేసిన ప్రతి రూపాయినీ చిరో సగం చెల్లించటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వాస్తవానికి పెళ్లి కూడా ఒక విధంగా కంపెనీ ఏర్పాటు చేయటం

లాంటిదేనని కపూర్ అన్నారు. సహ వ్యవస్థాపకులు ఇద్దరూ వేరువేరు లక్ష్యాలను కలిగి ఉండటం గందరగోళానికి గురిచేయటంతో పాటు వారిని విజయం వైపు నడిపించదని అన్నారు. ఇంట్లో వంట, పిల్లల సంరక్షణ, ఆర్థిక అంశాలను పంచుకున్నట్లే ఎవరు ఏం పని చేయాలనేది క్లారిటీ ఉండాలన్నారు. ఇక విజయవంతమైన వైవాహిక జీవితం కావాలంటే భార్యా భర్తలిద్దరూ సంపాదించినా దానిని ఒక్కటిగా చేసి ఆర్థిక ప్రణాళికలు రచించాలని చెప్పారు. పెళ్లి చేసుకుని ఒక్కటైనాక కూడా విడివిడిగా బిల్లులు స్ప్లిట్ చేయటం మంచి అలవాటు కాదని దానిని మార్చుకోవాలన్నారు. పెద్ద నగరాల్లో నివసిస్తున్న సంపన్న వర్గాల్లోని భార్యా భర్తల ప్రవర్తనలకు కపూర్ పోస్ట్ అద్దం పడుతోంది.

# అక్టోబర్ నెలలో తిరుమలకు వెళ్లే ప్లాన్ లో ఉన్నారా..? ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు ఎప్పుడు రిలీజ్ చేస్తారంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:**అక్టోబర్ నెలకు సంబంధించి దర్శన కోటా విడుదల వివరాలు వెల్లడించింది టీటీడీ. అక్టోబర్ నెలకు సంబంధించి వివిధ దర్శనాలు, గదుల కోటాను జులై 19న ఉదయం 10 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూలై 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ఓ ప్రకటనలో తెలిపింది టీటీడీ. ఈ టికెట్లు పొందిన వారు జూలై 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని.. 22న ఆర్జిత సేవా టికెట్ల విడుదల చేయనున్నట్లు తెలిపింది టీటీడీ.

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, వార్షిక పుష్పయాగం టికెట్లను జూలై 22న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. వర్చువల్ సేవల కోటాను జులై 22న విడుదల చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను జూలై 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది టీటీడీ.

**జులై 23న అంగప్రదక్షిణం టోకెన్లు :**

అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను జూలై 23న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. అదే రోజున శ్రీవాణి టికెట్లకు సంబంధించి ఆన్ లైన్ కోటా కూడా రిలీజ్ చేస్తున్నట్లు తెలిపింది.శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను జూలై 23వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల చేయనుంది టీటీడీ. వృద్ధులు, దివ్యాంగులకు సంబందించిన దర్శన కోటా జులై 23న మధ్యాహ్నం 3 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది టీటీడీ.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల:

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూలై 24న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. అలాగే తిరుమల, తిరుపతిలో గదులకు సంబంధించిన కోటా కూడా జులై 24న మధ్యాహ్నం 3 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది టీటీడీ. శ్రీవారి భక్తులు టీటీడీ అధికారిక వెబ్ సైటులోనే టికెట్లు బుక్ చేసుకోవాలని.. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించింది టీటీడీ.

# అమెరికాతో భారత్ తగ్గేదేలే.. కారణం ఎందుకు అంటే ?

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతం తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. అయితే, జంతువుల భాగాలు అంటే మాంసం లేదా రక్తం వంటి తినని ఆవుల నుండి పాలు దిగుమతి చేసుకునేల కఠినమైన సర్టిఫికేషన్ ఉండాలని భారతదేశం పట్టుబడుతోంది. మతపరమైన, సాంస్కృతిక కారణాల వల్ల భారతదేశం పాల వినియోగదారులను రక్షించుకోవడానికి దీనిపై చర్చించడానికి వీలు లేదని భావిస్తోంది.



అయితే 2030 నాటికి రెండు దేశాల వాణిజ్యాన్ని 50 వేల కోట్లకి పెంచాలన్న లక్ష్యంతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై మొదలైన ఈ చర్చలు కొన్ని కీలక కారణాల వల్ల ఆగిపోయాయి. అమెరికా నుండి దిగుమతి చేసుకున్న పాల ఉత్పత్తులు మాంసం లేదా రక్తం వంటి జంతు ఆధారిత మాంసం, రక్తం వంటివి తినని ఆవుల నుండి వచ్చేల భారతదేశం ఒక కఠినమైన సర్టిఫికేషన్ కోరడం ఇందుకు ముఖ్య కారణం.

జంతు పదార్థాలు, మాంసం, రక్తం అందిస్తూ ఒక ఆవు పాలతో తయారు చేసిన వెన్న లేదా నెయ్యిని భారతదేశం ఎప్పటికీ అనుమతించదు అని న్యూఢిల్లీకి చెందిన థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కి చెందిన అజయ్ శ్రీవాస్తవ అన్నారు. భారతదేశంలో ఆవు పాలు కేవలం వినియోగం కోసం మాత్రమే కాకుండా పాల ఉత్పత్తులు ఇంకా ప్రతిరోజు మతపరమైన ఆచారాలలో కూడా ముఖ్యమైన భాగం.

అయితే అమెరికా ఈ విషయాన్నీ తేలికగా తీసుకుంటుంది. ప్రపంచంలోనే ప్రముఖ పాల ఉత్పత్తిదారి అయిన భారతదేశం, లక్షలాది మంది చిన్న పాడి రైతులను రక్షించడానికి దృఢంగా నిలుస్తుంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల సమాచారం ప్రకారం, భారతదేశం డైరీ పరిశ్రమ 140 కోట్లకు పైగా ప్రజలకు ఆహారాన్ని అందిస్తోంది ఇంకా 8 కోట్లకు పైగా ప్రజలకు, ముఖ్యంగా చిన్న రైతుల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోందని తెలిపారు.

ప్రస్తుతం భారతదేశం జున్నుపై 30%, వెన్నపై 40%, పాలపొడిపై 60% అధిక సుంకాలను విధిస్తోంది, దీనివల్ల న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి తక్కువ ఖర్చుతో, ఉత్పత్తిదారుల నుండి కూడా దిగుమతులు సాధ్యం కాదు. భారతదేశంలో ఎక్కువగా శాకాహారులు కూడా ఉన్నారు. వీరు జంతువుల భాగాలు లేదా మాంసం వంటి ఆహారంగా తీసుకున్న ఆవుల పాల ఉత్పత్తులను మతపరమైన నమ్మకాలకు విరుద్ధంగా భావిస్తారు. భారతీయ ప్రజల సాంస్కృతిక, ఆహార ప్రాధాన్యతలు దీనికి ప్రధాన కారణం.

అంతేకాకుండా భారతదేశంలోని పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ ఆహార దిగుమతులకు పశువైద్య ధృవీకరణ తప్పనిసరి చేసింది. దీని ప్రకారం, దిగుమతి చేసుకునే పాల ఉత్పత్తులు జంతువుల విడి భాగాలు లేదా మాంసం ఆహారంగా తినని ఆవుల నుండి రావాలని నిబంధన ఉంది. అమెరికా ఈ నిబంధనను ప్రపంచ వాణిజ్య సంస్థ లో విమర్శించింది.

అమెరికా గత సంవత్సరం %వి%8.22 బిలియన్ల పాల ఉత్పత్తులను ఎగుమతి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారి, వినియోగదారి అయిన భారతదేశంలోకి అమెరికా పాల ఉత్పత్తులను విస్తరించడానికి ఒత్తిడి చేస్తోంది. ప్రస్తుతం %వి%16.8 బిలియన్ల విలువైన భారతదేశ డైరీ పరిశ్రమ, ప్రపంచ పాల ఉత్పత్తిలో దాదాపు నాలుగో వంతు (239 మిలియన్ మెట్రిక్ టన్నులు) వాటాతో ఉంది. ఇంకా లక్షల మందికి జీవనోపాధిని అందిస్తుంది.

అమెరికా పాల ఉత్పత్తులు ఇండియన్ మార్కెట్‌లోకి రావడం వల్ల తక్కువ ధరకు పాల ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. దింతో దేశీయ ధరలు తగ్గి చిన్న రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తుందని ఆందోళనలు వినిపిస్తున్నాయి. అంతేకాదు భారతదేశం పాల ఉత్పత్తుల మార్కెట్‌లోకి అమెరికాకు రానిస్తే ఏటా రూ. 1.03 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎస్‌బీఐ విశ్లేషణ అంచనా వేసింది.

భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో డైరీ పరిశ్రమ కీలకమైనది. ఇది జాతీయ స్థూల విలువ ఆధారిత (GVA)కి సుమారు 2.5–3% వాటా అంటే సుమారు రూ. 7.5–9 లక్షల కోట్లు అందిస్తుంది. GVA అంటే వస్తువులు, సేవల మొత్తం విలువ నుండి ముడి పదార్థాల ఖర్చును తీసివేసిన తర్వాత మిగిలేది.

"పందులు, చేపలు, కోళ్లు, గుర్రాలు, పిల్లులు లేదా కుక్కల భాగాలను ఆవులు తినడానికి ఇప్పటికీ అనుమతి ఉంది. పశువులు ప్రోటీన్ కోసం పంది, గుర్రపు రక్తాన్ని తినడం కొనసాగించవచ్చు, అలాగే పశువుల భాగాల నుండి వచ్చే కొవ్వును (ట్రాలో) కూడా ఉపయోగించవచ్చు. పశువుల మేతలో ప్రతిరోజు జంతువుల భాగాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పౌల్ట్రీ వ్యర్థాలు కూడా ఉపయోగిస్తారు" అని తేలింది. %ఖూ=% నేషనల్ ట్రేడ్ ఎస్టిమేట్ (%చీఞు%) ప్రకారం, జంతువుల భాగాలను ఆహారంగా తీసుకునే ఆవుల నుండి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడంపై భారతదేశం నిషేధాన్ని గట్టిగా కొనసాగిస్తోంది.

# నిఫా వైరస్ సోకిన వారు ఈ జాగ్రత్తలు పాటించాల్సిందే.. ఇద్దరి మరణంతో హై అలెర్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ లో నిఫా వైరస్ కలకలం రేపుతుంది. కేరళలో ఈ వైరస్ సోకి ఇప్పటి వరకూ ఇద్దరు మరణించారు. దీంతో కేరళ ప్రభుత్వం అప్రమత్తమయింది. మలప్పురం చెందిన ఒక వ్యక్తి, పాకల్కాడ్ జిల్లాలో మరొక వ్యక్తి నిఫా వైరస్ తో మరణించారు. ఈ నెల 12వ తేదీన పాలక్కాడ్ జిల్లాలో మరణించిన వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు మంజేరి మెడికల్ కళాశాలలో జరిపిన పరీక్షల్లో నిర్ధారణ అయిందనిమంత్రి వీణా జార్జి తెలిపారు. అయితే ఈ వ్యక్తితో కాంట్రాక్టు అయిన వ్యక్తులను గుర్తించి వారికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నాయి.

**కాంట్రాక్టు అయిన వ్యక్తి నుంచి...**

మొత్తం దాదాపు యాభై మంది వరకూ ఆ వ్యక్తితో కాంట్రాక్టు అయినట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిందరికీ ఐసొలేషన్ లో ఉంచి వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. మరణించిన వ్యక్తి మొబైల్ డేటా ఆధారంగా కాంట్రాక్ట్ అయిన వారి వివరాలను సేకరించామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వారి కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులు కూడా ఇందులో ఉండటంతో వారందరి రక్త నమూనాలను సేకరించడమే కాకుండా, వారు మరెవ్వరితో కాంట్రాక్టు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వారందరినీ ఐసొలేషన్ కు తరలించాలని నిర్ణయించింది.

**ప్రత్యేక బృందాలను నియమించి...**

నిఫా వైరస్ మరణాలు రెండింటికి చేరడంతో కేరళ ప్రభుత్వం జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించే పనిలో పడింది కేంద్ర ప్రభుత్వం. సాధారణ జ్వరమా? వైరల్ ఫీవరా? లేక మరైదైనా ఇన్ ఫెక్షనా? అన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. ఆరోగ్య శాఖకు చెందిన ప్రత్యేక బృందాలను నియమించి ఇంటింటికీ తిరిగి జ్వరపీడితులను గుర్తించేపనిలో ఉన్నారు. పాలక్కాడ్, మలప్పురం జిల్లాల్లో ఈ వైరస్ మరణాలున్నందున అక్కడ మాత్రం మరింత అప్రమత్తం చేశారు. ప్రజలు ఖచ్చితంగా బయటకు వస్తే మాస్క్ లు ధరించాల్సిందేనని, బౌతికదూరం పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేరళ ప్రభుత్వం ఆ జిల్లాల ప్రజలను అప్రమత్తం చేసింది. అనవసరంగా ఆసుపత్రుల వద్దకు కూడా రావద్దని తెలిపింది.

**ఆరు జిల్లాల్లో హెచ్చరికలు...**

కేరళలోని ఆరు జిల్లాలకు ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఆసుపత్రికివచ్చినా, బయటకు వెళ్లినా ఈ జిల్లాకు చెందిన వారు ఖచ్చితంగా మాస్క్ లు ధరించి ఉండాలని

కోరారు. తీవ్రమైన జ్వరం రావడంతో పాటు దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించింది. ఏ మాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని ఆరోగ్య శాఖ కు చెందిన కార్యకర్తను సంప్రదించాలని కూడా తెలిపింది. వీలయినంత వరకూ ఈ వ్యాధులున్న వారు బయటకు రాకుండా సమాచారం వస్తే ఇంటికి వచ్చి ఆరోగ్య కార్కకర్తలు పరీక్షలు నిర్వహిస్తారని కూడా తెలిపింది. మొత్తం కేరళలో 543 మంది ఇలాంటి రకమైన వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది.

# ఏసీబీ అధికారులు లెక్కేస్తున్నారు.. పది గంటల నుంచి కొనసాగుతున్న సోదాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**నీటి పారుదల శాఖ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధరరావు ఇంట్లో ఇంకా ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. దాదాపు పది గంటలకు పైగానే ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు హైదరాబాద్, జహీరాబాద్, కరీంనగర్ లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు జరుపుతున్నారు. మొత్తం పది ప్రాంతాల్లో సోదాలు జరుపుతున్న అధికారులు ఆదాయానికి మించిన ఆస్తులున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ లో ప్లాట్లు, ఫ్లాట్లతో పాటు నగరం శివారులో వ్యవసాయభూములతో పాటు పలువురు వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సోదాలు రేపటి వరకూ కొనసాగే అవకాశముంది.




### ఆదాయానికి మించిన...

మురళీధరరావు బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దయెత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలపై వరసగా నీటిపారుదల శాఖలో పనిచేసిన అధికారుల ఇళ్లపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పెద్దయెత్తున అవినీతి జరిగిందని, అధికారులు పెద్దమొత్తంలో ఆస్తులు కూడబెట్టడమే కాకుండా నగదు, బంగారు, వెండి ఆభరణాలను కొనుగోలు చేశారని, ఆదాయానికి మించినఆస్తులు కలిగి ఉన్నారని,పూర్తి సమాచారాన్నిరహస్యంగా సేకరించిన అనంతరమే ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నారు.

### సమాచారం సేకరించిన తర్వాత...

మురళీధరరావు పై కూడా ఇదే రకమైన ఆరోపణల నేపథ్యంలో ఆయన ఆస్తుల వివరాలను రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన కొందరు అధికారుల ఇళ్లలో సోదాలు చేసి ఆదాయానికి మించి ఆస్తులన్నాయని అరెస్ట్ చేసిన నేపథ్యంలో మురళీధరరావు ఆస్తుల విలువ ఎంతన్నది లెక్కగట్టేపనిలో అవినీతి నిరోధక శాఖ అధికారులున్నారు.

కాళేశ్వరం మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ ను అరెస్ట్ చేసి కస్టడీ తీసుకుని విచారించిన సమయంలో కొన్ని వివరాలను రాబట్టిన ఏసీబీ అధికారుల ఆ దిశగా ఇంకా కొందరి ఇళ్లపై దాడులు చేసే అవకాశముందని తెలిసింది. నూనె శ్రీధర్ తాము అక్రమంగా సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని ఉన్నతాధికారులకు కూడా ఇచ్చినట్లు తెలపడంతో ఆ విచారణలో భాగంగానే మురళిధరరావు ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఏసీబీ అధికారులు ఆస్తుల వివరాలను అధికారికంగా ప్రకటించాల్సిఉంది.

# బనకచర్ల పై ఏం జరుగుతుందో.. వాటర్ వార్ పై ఎవరిది పై చేయి?

**హైదరాబాద్ పెన్ పవర్:**పోలవరం – బనకచర్ల ప్రాజెక్టు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం మాత్రం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. గోదావరి నది నుంచి వరద జలాలు సముద్రంలోకి వృధాగా పోయే నీటిని మాత్రమే తాము వినియోగించుకుంటామని, దిగువన ఉన్న తాము అదనపు నీళ్లను వాడుకోలేం కదా? అని ఏపీ ప్రభుత్వం ప్రశ్నిస్తుంది. ఈ బనకచర్ల ప్రాజెక్టు కారణంగా రాయలసీమకు సాగునీరు, తాగునీరు అందించవచ్చని, తద్వారా వెనకబడిన రాయలసీమ ప్రాంతం సుభిక్షంగా మారుతుందని, ఇందుకు ఎనభై వేల కోట్ల రూపాయల అంచనా వ్యయం అవుతుందని చెప్పింది.




### ప్రాజెక్టుపైనే ప్రధానంగా...

అయితే పోలవరం బనకచర్ల ప్రాజెక్టు కు సబంధించి పర్యావరణ అనుమతులు తీసుకోవాలని కేంద్ర జల సంఘం తేల్చి చెప్పింది. మరొకవైపు పోలవరం అధారిటీ కూడా కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ప్రధానంగా బనకచర్ల ప్రాజెక్టుపైనే ఆయన చర్చించడానికి వెళుతున్నారు. రెండు రోజుల చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి అమిత్ షాతో పాటు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను కూడా కలసి బనకచర్ల ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు లభించేలా సహకరించాలని కోరనున్నారు. ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ గా పదే పదే చెబుతున్న చంద్రబాబు ఢిల్లీ పెద్దలపై వత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

### రేపు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో...

నేడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లనున్నారు. జలవివాదాలపై చర్చ కోసం రేపు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రితో పాటు అధికారులు కూడా సమావేశమవుతారు. ఇరువురు ముఖ్యమంత్రలతో బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని, తెలంగాణ ప్రభుత్వం వద్ద ఉన్న అభ్యంతరాలను వింటారు. రేపు మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి నేతృత్వంలో తెలుగు రాష్ట్రాలముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు భేటీ అవుతారు. సమావేశానికి ఇద్దరు సీఎంలను పిలుస్తూ కేంద్ర జలశక్తి సర్క్యూలర్ జారీ చేసింది. అయితే ఏ పీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం షాక్ ఇచ్చింది.

### నో చెప్పిన తెలంగాణ...

బనకచర్ల ప్రాజెక్ట్ పై చర్చించడానికి విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వంలేఖ రాసింది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో బనకచర్ల పై సమావేశానికి రేపు ఢిల్లీలో ఏర్పాట్లు చేసిన కేంద్రం ప్రభుత్వానికి లేఖతో సమాధానమిచ్చింది. బనకచర్లపై సింగిల్ ఎజెండా తో సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదన చేసింది. అయితే చర్చ అవసరం లేదంటూ ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించింది.

రెండు రోజులుగా ముఖ్యమంత్రుల సమావేశంపై తెలంగాణ లో జోరుగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో లేనిపోని అనుమానాలకు తావివ్వడం ఇష్టం లేకనే తెలంగాణ ప్రభుత్వం చర్చకు నో చెప్పినట్లుగా తెలుస్తోంది. మొత్తం మీద బనకచర్ల ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలకు ప్రధాన అంశం కాగా, కేంద్ర ప్రభుత్వానికి మాత్రం తలనొప్పిగా తయారయిందనే చెప్పాలి.

## కొత్త రకం రోబోలను తయారుచేసిన చైనా.. రైళ్లలో కూడా ప్రయాణిస్తాయి!

**హైదరాబాద్ పెన్ పవర్:** చైనాలోని షెన్‌జెన్ నగరంలో ఒక అద్భుతమైన మార్పు జరుగుతోంది. అక్కడ రైళ్లలో రోబోలను ఉపయోగిస్తున్నారు! ఈ రోబోలు రైళ్లలో ప్రయాణించి, 7-ఎలెవెన్ దుకాణాలకు సరుకులను అందిస్తున్నాయి. ఇంతకుముందు ఈ పనిని మనుషులు చేసేవారు, అది కొంచెం కష్టంగా ఉండేది. ఇప్పుడు రోబోల రాకతో ఆ సరుకు డెలివరీ సులువైంది.

### ఇవి తెలివైన రోబోలు


ఈ రోబోలు దాదాపు ఒక మీటరు ఎత్తు ఉంటాయి. ఈ రోబోలు చాలా తెలివైనవి... ఎలివేటర్లు ఎక్కుతాయి, ప్లాట్‌ఫారమ్‌లపై నడుస్తాయి, ఆఖరికి రైళ్లలో కూడా ప్రయాణిస్తాయి. ప్రజలు తక్కువగా ఉన్నప్పుడు, అంటే రద్దీ లేని వేళల్లో ఈ రోబోలు సరుకులను డెలివరీ చేస్తాయి. దుకాణాల సిబ్బంది ఇకపై సరుకులను మోసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఈ పనిని రోబోలు చూసుకుంటాయి.

### ఈ ప్రాజెక్ట్ విశేషాలు

ఇప్పటివరకు ఇలాంటివి 41 రోబోలను ఉపయోగిస్తున్నారు. భవిష్యత్తులో షెన్‌జెన్ సబ్‌వే స్టేషన్‌లలో ఉన్న వందకు పైగా 7-ఎలెవెన్ దుకాణాలకు ఇవే సరుకులను అందిస్తాయి. ఈ రోబోలకు ప్రత్యేక చక్రాలు ఉంటాయి, ఇవి లిఫ్టులలోకి, రైలు బోగీలలోకి వెళ్లడానికి వీలు కల్పిస్తాయి. ఈ రోబోలను చూసి ప్రయాణికులు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఇది పట్టణాల్లో సరుకు రవాణాను పూర్తిగా మార్చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. చైనా ఈ సాంకేతికతతో ఒక అడుగు ముందుకేసిందని చెప్పొచ్చు!

## సినీ ఫక్కీలో భర్త హత్య... భార్య, ప్రియుడు అరెస్టు

- తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన
- ముగ్గురి అరెస్టు.. పరారీలో ఒక నిందితుడు
- ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారుతో ఢీకొట్టించి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం



**హైదరాబాద్ పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లాలో సంచలనం సృష్టించిన భర్త హత్య కేసును పోలీసులు ఛేదించారు. సినీ ఫక్కీలో భర్తను హత్య చేసిన భార్యతో పాటు ఆమె ప్రియుడు, మరో ఇద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడు రామలింగస్వామి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన స్వామి హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. భార్య స్వాతి, ఆమె ప్రియుడు సాయికుమార్, సోదరుడు మహేశ్, ఇతరులతో కలిసి ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న స్వామిని కారుతో ఢీకొట్టించి, అది ప్రమాదవశాత్తు జరిగిందని చిత్రీకరించే ప్రయత్నం చేశారని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద స్వాతి, సాయికుమార్, మహేశ్‌పై కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి మూడు ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాతి కారును అద్దెకు తీసుకొని భర్తను హత్య చేయించింది.

## మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిలో మళ్లీ ఆశలు..




**హైదరాబాద్ పెన్ పవర్:**సీనియర్ నేత మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిలో మళ్లీ ఆశలు పెరిగాయి. మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కడంతో తనకు కూడా పార్టీ హైకమాండ్ ఏదో ఒక పదవి ఖచ్చితంగా ఇస్తుందన్న నమ్మకం పెరిగిపోయిందట. అశోక్ గజపతిరాజు లాగానే తాను కూడా పార్టీలో సీనియర్ నేత కావడంతో పాటు క్లిష్ట సమయంలో చంద్రబాబు కు అండగా నిలబడటంతో తనకు ఖచ్చితంగా పదవి లభిస్తుందన్న భావనలో ఉన్నారు. అశోక్ గజపతి రాజు కుమార్తె ఆదితి గజపతి రాజుకు కూడా గత ఎన్నికల్లో విజయనగరం టిక్కెట్ ఇవ్వగా, యనమల కుమార్తె దివ్యకు తుని నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. తునిలో యనమల దివ్య గెలిచింది. సుదీర్ఘకాలం తర్వాత తుని నియోజకవర్గంలో టీడీపీ గెలిచింది.

### గుర్తిస్తారన్న నమ్మకం...

ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో తనకు పెద్దల సభకు పంపాలని యనమల రామకృష్ణుడు బలంగా కోరుకుంటున్నారు. పార్టీ కోసం ఇప్పటి వరకూ తాను చేసిన కృషి, పడిన శ్రమను హైకమాండ్ గుర్తించకపోతుందా? అని యనమల బలంగా నమ్ముతున్నారు. అందుకే ప్రస్తుతం యనమల రామకృష్ణుడు మౌనంగానే ఉంటున్నారు. అదే సమయంలో తుని నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అలాగని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మీద విమర్శలు మానుకోలేదు. అంటే ఖచ్చితంగా చంద్రబాబు తనవైపు చూస్తారని యనమల గట్టిగా విశ్వసిస్తున్నారు. తనలాంటి సీనియర్ నేతలను, సామాజివర్గానికి చెందినవారిని పక్కన పెట్టే అవకాశం లేదని కూడా అంచనా వేస్తున్నారు.

### అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ...

ఆయన వయసుతో పాటు కొన్ని ప్రత్యేక పరిస్థితులు టీడీపీ అధినాయకత్వం మంత్రిపదవికి దూరం పెట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ యనమల రామకృష్ణుడు మంత్రి పదవిలో ఉంటారు. ఆయనకు తూర్పు గోదావరి జిల్లా నుంచి నియోజకవర్గం ఫిక్స్ అయినట్లేనని ఎవరైనా లెక్కలు వేసుకుంటారు. పైగా చంద్రబాబుకు యనమల అత్యంత సన్నిహితుడిగా ముద్రపడింది. అనేక కష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచారన్న పేరు కూడా పార్టీలో యనమల రామకృష్ణుడికి ఉంది. సీనియర్ నేత అయినా ఆయన సేవలను ఉపయోగించుకుంటారని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనమల రామకృష్ణుడుకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అప్పుడే కొంత సందిగ్ధత మొదలయింది.

### ఏదో ఒక పదవికి...

గత వైసీపీ హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టినప్పుడు యనమల రామకృష్ణుడు శాసనమండలిలో తన రాజకీయ చతురతను ఉపయోగించి బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోగలిగారు. ఇలా ఎలా చూసినా యనమల రామకృష్ణుడికి పదవి గ్యారంటీ అన్న ప్రచారం ఊపందుకుంది. మరొక వైపు అశోక్ గజపతిరాజుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఏడాది తర్వాత గోవా గవర్నర్ గా నియమించడంతో ఇక తనను కూడా ఇటు రాజ్యసభ కు కాని, అటు గవర్నర్ గా పంపుతారన్న నమ్మకం యనమల రామకృష్ణుడి వర్గంలో పెరిగిపోయింది. అందుకే ఇక యనమల రానున్న రోజుల్లో మరింత యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది భవిష్యత్ లో తేలనుంది.

## అడ్డుగా ఉన్నాడని భర్తను ఏసేసిన భార్య.. తెలంగాణలో మరో సంచలనం




**హైదరాబాద్ పెన్ పవర్:**మేఘాలయలో హనీమూన్ మర్డర్ జరిగిన తర్వాత దేశంలో వరసగా భార్యలు భర్తలను హత్య చేస్తున్నఘటనలు వరసగా జరుగుతున్నాయి. తాజాగా తెలంగాణలోని యాదాద్రి జిల్లాలోనూ భార్య భర్తను కారుతో తొక్కించి చంపేసిన ఘటన కలకలం సృష్టిస్తోంది. ఈ కేసులో సోదరుడు తన సన్నిహితుడు నిందితులని పోలీసులు తెలిపా్న. ర్ధరాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో కారు ప్రమాదంలో ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వస్తుపుల స్వామి మరణంచాడు. నిజానికిఇది ప్రమాదం కాదని పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో భార్య హత్యకు ప్లాన్ చేసిందని పోలీసులు కనుగొన్నారు.

### వివాహమై పిల్లలున్నా...

పల్లెర్ల గ్రామానికి చెందిన వస్తుపుల స్వామికిమోత్కూరు మండలం దాచారం గ్రామానికి చెందిన స్వాతితో వివాహం అయింది. ఇద్దరు కుమార్తెలు,కుమారుడు కూడా ఉన్నారు. స్వామి భువనగిరి పట్టణంలోని ఓ ట్రాక్టర్ షోరూంలో మేనేజర్ గా పనిచేస్తుండగా, తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ కు చెందిన స్సాయి కుమార్ తో స్వాతి వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. అయితే తాము కలుసుకోవడానికి భర్త అడ్డుగా ఉండటాన్ని సహించలేదకస్వామి, సాయికుమార్ త స్వామి హత్యకు పన్నాగం పన్నింది. ఒక కారు అద్దెకు తీసుకున్నారు. తన స్నేహితుడు వీరబాబుతో కలిసి భువనగిరిలో పనులు ముగించుకుని అర్ధరాత్రి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై స్వామి వస్తుండగా రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారి కాటేపల్లిలోని బ్రిడ్జి దాటగానే వెనుకనుంచి వేగంగా వచ్చిన ఓ కారు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది.

### రోడ్డు ప్రమాదంగా ...

యాభై మీటర్ల దూరం ఇద్దరీని ఈడ్చుకువెళ్లింది. దీంతో స్వామి అక్కడికక్కడే మృతిచెందగా,వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి.గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా, మేరుగైన చికిత్స నిమిత్తం వీరబాబును హైదరాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంపై తమకు అనుమానం ఉందని, స్వామిని భార్య తరుపువారే హత్య చేసి ఉంటారని స్వామి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు స్వామి భార్య స్వాతి, బావమరిది మహేష్ ను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. సాయికుమార్ ఓ కారు అద్దెకు తీసుకువచ్చి స్నేహితుడితో కలిసి కారు నడుపుకుంటూ స్వామి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడని పోలీసుల విచారణలో వెల్లడయింది. .అక్కడే ఉన్న మామిడి తోటలో కారును వదిలేసి పరారయ్యారు. ప్లాన్ ప్రకారం స్వామి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని చిత్రీకరించడానికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో స్వాతి , మహేష్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు వెదుకుతున్నారు.

## ప్రపంచ అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్.. టాప్ 10 నగరాలు ఇవే

- వరుసగా మూడోసారి ఈ ఘనత సాధించిన సింగపూర్
- హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానంలోకి వచ్చిన లండన్
- టాప్ 10 ఖరీదైన నగరాల్లో షాంఘై, మొనాకో, న్యూయార్క్, ప్యారిస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలో అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ నిలిచింది. జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం, వరుసగా మూడో సంవత్సరం సింగపూర్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంకు బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభవిస్తున్న లగ్జరీ ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్ స్టైల్ ఇండెక్స్ విశ్లేషించి ప్రపంచ ఖరీదైన నగరాల జాబితాను రూపొందించింది. ఈ ఏడాది ఫిబ్రవరి - మార్చి మధ్య సేకరించిన డేటాను పరిగణనలోకి తీసుకున్నట్లు జూలియస్ బేర్ తెలిపింది.టాప్ 10 నగరాలను పరిశీలిస్తే, మొదటి స్థానంలో సింగపూర్ ఉండగా, ఆ తర్వాత వరుసగా లండన్, హాంగ్‌కాంగ్, షాంఘై, మొనాకో, జ్యూరిచ్, న్యూయార్క్, ప్యారిస్, సావో పాలో, మిలాన్ నగరాలు ఉన్నాయి. గత సంవత్సరం రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను లండన్ వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకుంది. సింగపూర్ అత్యంత ఖరీదైన నగరంగా నిలవడానికి వివిధ కారణాలు ఉన్నాయని విశ్లేషించింది. సింగపూర్ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అందరికీ అనుకూలంగా ఉండటంతో పలువురు అంతర్జాతీయ వ్యాపారులు సింగపూర్ కేంద్రంగా తమ వ్యాపారాలను నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో వెనక్కి వెళ్లిన వ్యాపారులను కూడా తిరిగి రప్పించేందుకు సింగపూర్ సంస్కరణలు చేపట్టింది. దీంతో అక్కడి జీవన వ్యయం ఒక్కసారిగా పెరిగింది.

సింగపూర్ వాసులు ఎక్కువగా బంగారం కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. ప్రధానంగా ఈ అంశం సింగపూర్‌ను అత్యంత ఖరీదైన నగరంగా నిలిచేలా చేసింది. సింగపూర్ ప్రజలు ఆహారం, ఆరోగ్య ఉత్పత్తులు, విద్యపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.